# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 9, సెప్టెంబర్ 2026


# గణేష్ మండపం నిర్వాహకులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

★ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**అదిలాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:**

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ సూచించిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్ పోర్టల్ ద్వారా మండపం ఏర్పాటు ప్రదేశం, నిమజ్జనం తేదీ, సమయం, ఊరేగింపు మార్గం, నిర్వాహకులు, వాలంటీర్ల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఎస్పీ సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ కేవలం సమాచారం, భద్రతా పర్యవేక్షణ కొరకేనని స్పష్టం చేశారు. గతంలో నమోదు చేసుకున్న వారు అదే నంబర్‌తో ఈ ఏడాది కూడా సమాచారాన్ని సమర్పించవచ్చని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి వదంతులను నమ్మవద్దని, సందేహాలు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌ను కానీ, డయల్ 100/112 సేవలను కానీ సంప్రదించాలని కోరారు. ఉత్సవాలను ఆనందోత్సవాల మధ్య శాంతియుతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే గణపతి మండపాల వద్ద ఎలాంటి లాటరీలు నిర్వహించవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గని ప్రమాదంపై భగ్గుమన్న కార్మికులు



■ కార్మికులకు మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన

■ గని పైయాజమాన్యాన్ని నిలదీసిన కార్మికులు

మందమర్రి, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:

**మందమర్రి ఏరియాలోని కాసిపేట టూ ఇంక్లైన్ గనిలో సోమవారం జరిగిన ప్రమాదంపై మంగళవారం రోజున కార్మికులందరూ మొదటి షిఫ్ట్‌లో ప్రమాదం జరిగిన తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ యాజమాన్యాన్ని నిలదీశారు. యాజమాన్యం కార్మికులపై ఆజమాయేసి చలయిస్తూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో హెచ్ఎంఎస్, ఏఐటియుసి, ఐ ఎన్ టి యు సి, టీబీజీకేఎస్ కార్మిక సంఘ నాయకులు పాల్గొనడం జరిగింది. యాజమాన్యం మొదటిషిఫ్ట్‌లో ఉదయం వేళ కార్మికులకు కనీసం తినడానికి సమయం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. వెల్ఫేర్ ఆఫీసర్‌పై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఏదైనా సమస్యపై వెల్ఫేర్ ఆఫీసర్‌ను సంప్రదిస్తే సరైన స్పందన ఇవ్వడం లేదని కార్మికులని చులకన భావంతో చూస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం చేసే దూకుడు ఆలోచనలతో కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని సోమవారం జరిగిన సంఘటన ఇందుకు నిదర్శనమని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. మ్యాన్ రైడింగ్ను 14 లెవెల్ నుండి 19 లెవెల్ వరకు పొడిగించాలని కార్మికులు కోరుతున్నారు. మ్యాన్ రైడింగ్ ప్రవేశం వద్ద గేటు పెట్టడంతో కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాక్షులు, గ్లౌజులు ఇవ్వడం లేదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక టెక్నీషియన్లు ఒక్కరోజు విధి నిర్వహణకు రాకున్నా వారికి సస్పెన్షన్ ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల లీవ్ పై యాజమాన్యం ఆజమైసి చలయిస్తుందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా యాజమాన్యం కార్మికుల పట్ల తీరు మార్చుకోవాలని కార్మిక సంఘ నాయకులు, కార్మికులు కోరుతున్నారు.**

# గణేష్ నిమజ్జన కేంద్రాలు పరిశీలన...



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**


రాబోయే గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తోందని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని ప్రధాన నిమజ్జన కేంద్రాలైన ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పెద్దవాగులను ఆమె స్వయంగా పరిశీలించారు. నిమజ్జన కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, బారికేడింగ్, ప్రజల రాకపోకలు తదితర అంశాలను పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. గణేష్ మండపాల నుంచి నిమజ్జన కేంద్రాల వరకు ఊరేగింపు మార్గాలను పరిశీలించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్, రోప్ బ్యారియర్స్, లైటింగ్, ప్రత్యేక పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. నీటి వనరుల వద్ద ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలని, క్రేన్‌లు, ఇతర యంత్ర పరికరాలను సురక్షితంగా వినియోగించేలా చూడాలని ఆదేశించారు.మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, వైద్య, అగ్నిమాపక, రక్షణ బృందాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజలతో సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు.

# అర్హులందరికీ సకాలంలో రుణాలు ఇవ్వాలి

● కలెక్టర్ భవేష్ మిశ్రా

● జిల్లా ఆర్థిక పురోగతికి బ్యాంకులదే కీలకపాత్ర

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:**



జిల్లా ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడంలో బ్యాంకుల పాత్ర కీలకమని, నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను వంద శాతం సాధించి తీరాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి డీసీసీ, డీఎల్ఆర్సీ సమీక్షా సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. 202627 వార్షిక రుణ ప్రణాళిక పురోగతి, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 202627 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని అన్ని బ్యాంకులకు కలిపి రూ.7,952.87 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు కేవలం రూ.2,331.18 కోట్లు అంటే 29.31 శాతం మాత్రమే సాధించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాధాన్యతా రంగాలకు నిర్దేశించిన రూ.6,661.73 కోట్లలో రూ.1,847.71 కోట్లు అంటే 27.74 శాతం మాత్రమే పూర్తయిందన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళా స్వయం సహాయక సంఘాలు, మిగతా 2లో..

# బియ్యాన్ని త్వరగా అందించాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బియ్యాన్ని త్వరగా అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలం అంకుశాపూర్ గ్రామంలో గల సమతా రైస్ మిల్‌ను ఆకస్మికంగా సందర్శించి రైస్ మిల్లు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి సేకరించిన ధాన్యాన్ని సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించడం జరిగిందని, రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని మద్దికల్ గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని, మురుగు కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా శుభ్రపరచాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేయాలని, నిర్దేశిత విస్తీర్ణంలో నిర్మించిన ఇండ్లకు మాత్రమే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామంలో కొంతమంది రైతులు వరి సాగు చేయడాన్ని గమనించి వారితో మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. పంట సాగుకు బోర్లు, చెరువు అందుబాటులో ఉండడంతో వరి సాగు చేస్తున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్ లలో వివరాలు నమోదు చేస్తూ సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. రీ సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, విచారణ కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం తయారీలో శుభ్రత నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచించారు. 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి స్వయంగా వారికి పాఠ్యాంశాలు బోధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని సందర్శించి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో మండల తహసిల్దార్ సదానందం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**- 21 మందికి పరీక్షలు.. 12 మందికి శస్త్రచికిత్స అవసరంగా గుర్తింపు**

**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :**



ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి హాజరైన 21 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 12 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి విడతల వారీగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి మంగళవారం ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిర్పూర్ శాసనసభ్యుడు, ప్రజాబంధు ఫౌండేషన్ అధ్యక్షుడు డా. పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ కంటి శుక్లాలు ఉన్నవారు, చూపు మందగించిన వారు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు సైతం అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు.

## 305 మంది విద్యార్థులకు దృష్టి లోపం గుర్తింపు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య (ఆర్బీఎస్కె) బృందాలు నిర్వహించిన కంటి పరీక్షల్లో 305 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగేంద్ర పేర్కొన్నారు. మోడల్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలను అందజేస్తోందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. విద్యార్థుల్లో కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, వారికి అవసరమైన వైద్య సేవలు అందించడంలో ఆర్బీఎస్కె బృందాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చదువుకునే సమయంలో తగిన వెలుతురు ఉండేలా చూసుకోవడంతో పాటు మొబైల్ ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాల వినియోగాన్ని పరిమితం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. కంటి చూపులో ఇబ్బందులు ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించడం ద్వారా చదువులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేష్, ఆఫీస్ సూపరింటెండెంట్ షాహిదున్, రమేష్, ఆర్బీఎస్కె వైద్యులు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ పూజతో పాటు వైద్య సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



## హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా తాటి శ్రీనివాస్

**- నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**

**కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణ హిందూ ఉత్సవ సమితి నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం సాయంత్రం పద్మశాలి భవన్‌లో నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సహ కార్యవాహ ప్రముఖ్ రంగస్వామి మార్గదర్శకత్వంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా తాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అరుణ్ లోయ, కోశాధికారిగా దెబ్బటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా విజయ్ యాదవ్, యెమ్మాజీ సంతోష్, దుర్గం ప్రశాంత్, అంజనేయులు గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా సిద్దం శ్రీనివాస్, వినోద్, దేశ్‌ముఖ్ శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పెద్ది హరీష్, కళ్యాణ్, అనిల్ ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా ఈర్ల విశ్వేశ్వర్‌రావు, దేశ్‌ముఖ్ శ్రీనివాస్, వీరభద్రచారి, శివ గౌడ్‌ను, గౌరవ అధ్యక్షులుగా ..సిందం శ్రీనివాస్, డా. కొత్తపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ (డెంటింగ్)..ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఐకమత్యంతో ముందుకు సాగుతూ సమాజహిత కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో సమితిని మరింత బలోపేతం చేస్తామని సభ్యులు తెలిపారు. సమావేశంలో సిందం శ్రీనివాస్, యెమ్మాజీ సంతోష్, మహావీర్ ప్రసాద్ లోయా, రవీంద్రచారి, వేణు, కవర్ పాల్, తౌటి అచల్, గుడెల్లి వంశీ, కోటి, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## లక్షెట్టిపేట ఆంధ్ర బోర్‌లో చోరీ

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట ఆంధ్ర బోర్‌లో చోరీ జరిగినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఈనెల ఆరో తారీఖున ఇంటి యజమానులు ఇంటికి తాళం వేసి పని నిమిత్తం హాజీపూర్ వెళ్ళగా గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి తాళం పగలగొట్టి బీరువాలోని 12 వేల రూపాయల నగదు, పావుతులం బంగారం, రింగ్ దోచుకెళ్లారు. మంగళవారం రోజు ఉదయం ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వాళ్ళు గమనించి యజమానురాలకు సమాచారం అందించడంతో వాళ్లు వచ్చి చూసేసరికి చోరీ విషయం బయటపడింది. ఇంటి యజమానురాలు దుంపటి సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.

## అర్హులందరికీ సకాలంలో రుణాలు ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

చిన్న వ్యాపారులకు రుణాలు సకాలంలో అందేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా విద్యా రుణాల మంజూరు చాలా తక్కువగా ఉందని, పేద, మధ్య తరగతి విద్యార్థులకు అధిక సంఖ్యలో రుణాలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో బ్యాంకు ఖాతాలు లేని ప్రతి ఒక్కరికీ సెప్టెంబర్ నెలలోగా ఖాతాలు తెరిచేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం లక్ష్యంగా పెట్టుకున్న 3,500 ఖాతాల్లో ఇప్పటికే 1,022 కొత్త ఖాతాలు ప్రారంభించినట్లు తెలిపారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ పథకాల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండవద్దన్నారు. ఎస్‌హెచ్‌జీ, పీఎం స్వనిధి రుణాల్లో ఎన్‌పీఏలను తగ్గించేందుకు మున్సిపల్ కమిషనర్లతో సమావేశాలు నిర్వహించాలని ఎల్‌డీఎం బి. రామ్‌గోపాల్ ను ఆదేశించారు. విజయ డెయిరీతో టైఅప్ ద్వారా పాడి పశువుల కొనుగోలు రుణాలను వేగవంతం చేయాలని, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలని జిల్లా పశువైద్యాధికారిని ఆదేశించారు. రైస్ మిల్లుల ఫైనాన్స్‌కు అవసరమైన ఎన్‌ఓసీలు, బ్యాంకు గ్యారెంటీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై కింద క్లెయిమ్‌లు పొందిన కుటుంబాల కథలను విజయగాథలుగా ప్రచారం చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావంపై నివేదిక ఇవ్వాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం, ఎల్‌బీఓ ఎస్. రాములు, పీడీ డీఆర్‌డీఏ విజయలక్ష్మి, ఆర్ఎం నవీన్ పురం, ఆర్‌బీఓ ఆదిలాబాద్ పియూష్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, నాబార్డ్, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**- సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత**

**కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 30 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారిలో 12 మందికి కేటరాక్ట్ (కంటి శుక్లాలు) శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో ఎంపికైన 12 మందిని సొసైటీ సొంత ఖర్చులతో రవాణా, భోజన సదుపాయాలు కల్పించి బెల్లంపల్లిలోని లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి తరలించి శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి మంగళవారం కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఇప్పటికే శస్త్రచికిత్సలు చేయించుకుని లబ్ధి పొందిన వారు ఇతరులకు కూడా ఈ సేవలపై అవగాహన కల్పించి, అవసరమైన వారికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

**నిర్మల్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్మల్‌లో భారీ ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తొలుత ఇందిరానగర్‌లోని పార్టీ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లి, అనంతరం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులతో అడ్డుకోవడం సరికాదన్నారు. మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పాలనలో కాంగ్రెస్ వైఫల్యం : కొరిపల్లి రాంకిషన్ రెడ్డి

పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కొరిపల్లి రాంకిషన్ రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ కొరిపల్లి విజయలక్ష్మి, పార్టీ నాయకులు లోలం శ్యాంసుందర్, మారగొండ రాము, కొరిపల్లి భూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలి

**ఉట్నూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై సమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. దళితులు ఉన్నత పదవుల్లో ఉండటం చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ సమాజానికి సిగ్గుచేటని, ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి చంద్రయ్య, ఇక్బాల్, జగదీష్ జాదవ్, మెస్రం భాగ్యలక్ష్మి, బిరుదుల లాజర్, దుట రాజేశ్వర్, మార్సుకోల తిరుపతి, ఆత్రం తిరుపతి, అన్సర్, స్వామి, రాజేష్, నందం, ఖలీం, అశోక్, బానోత్ జైవంత్ రావ్, ఎస్పీ రెడ్డి, శ్రీనివాస్ జాదవ్, ఖైసర్, పృథ్వీ, సతీష్, రాములు, శివాజీలతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాత మధు వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన

**- దిష్టిబొమ్మ దహనం.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్**

**కౌటాల, సెప్టెంబర్8,ప్రభాతవార్త;**

కౌటాల మండల కేంద్రంలోని కొమరం భీమ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బి ఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జానకిరావ్ ఆధ్వర్యంలో నాయకులు తాత మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం జానకిరావ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ఉన్న తాత మధు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సామాజిక వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన ఆయనపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎస్సైకి వినతి పత్రం అందజేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ప్రజాప్రతినిధులు వివాదాస్పద వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తాత మధుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఎమ్మెల్సీ తాతా మధు క్షమాపణ చెప్పాలి

**నిర్మల్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్సీ తాతా మధులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమందు, డీసీసీ ప్రధాన కార్యదర్శి జునైద్ మెమెన్‌లు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత నాయకుడిని అవమానించడం బీఆర్ఎస్ అహంకారానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల హరీష్, మాజీ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో

**జన్నారం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

దళిత స్పీకర్ పై అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందు నాయక్ డిమాండ్ చేశారు. నిర్మల్ డిసిసి అధ్యక్షుడు, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మను తగలబెట్టడానికి ప్రయత్నించిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు నందు నాయక్ మాట్లాడుతూ దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని అంతే కాకుండా బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే అవమానకరమని అన్నారు. స్పీకర్ పదవి అనేది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన పదవి కాదని అది శాసనసభ గౌరవానికి రాజ్యాంగ వ్యవస్థకు ప్రతీక అని అన్నారు.కావున స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎమ్మెల్సీ తాత మధు వెంటనే వెనక్కి తీసుకోవాలని,లేనియెడల ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీ నారాయణ, పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ ఫసిఉల్లా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముజాఫర్, ఎస్సి సెల్ అధ్యక్షులు మామిడిపెల్లి ఇంద్రయ్య, ఎంపిటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు రియజోద్దీన్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కుదిరే వెంకన్న, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్ చారి, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు గొర్రె మహేష్ యాధవ్,సీనియర్ నాయకులు ముత్యం సతీష్, దూమల్ల రమేష్, మచ్చ శంకరయ్య, సుధాకర్, నందు నాయక్, అబ్దుల్ ముజ్జు, దూమల్ల ప్రవీణ్, గంగన్న, పాదం రాకేష్, పాపా గౌడ్, సోషల్ మీడియా నాయకులు షాకిర్, రాహుల్, సర్పంచ్‌లు, వర్డ్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తాతా మధును అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి

**- కాంగ్రెస్ కమిటీ టిపిసిసి రాష్ట ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**

అసెంబ్లీ స్పీకర్, దళిత నేత గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు ఉద్దేశపూర్వకంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్ అన్నారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల ప్రోత్సాహంతో తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, ఆయన దివంగత తల్లిని ఉద్దేశించి దుర్భాషలాడటం దారుణమని పేర్కొన్నారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీతో పాటు తెలంగాణ దళిత సమాజం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆధిపత్య కుల అహంకారంతో దళిత స్పీకర్‌ను బహిరంగంగా అవమానించిన తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీని కోరారు. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి శాశ్వతంగా అనర్హుడిగా ప్రకటించాలని శాసన మండలి చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను రెచ్చగొట్టి అసెంబ్లీకి పంపారని, ఈ నేపథ్యంలోనే స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయించారని ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై కూడా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని దుర్గం భాస్కర్ డిమాండ్ చేశారు.

## తాతా మధుపై చర్యలు తీసుకోవాలి..

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు అన్నారు. స్పీకర్ పదవిలో ఉన్న దళిత నేత గడ్డం ప్రసాద్ తల్లిని ఉద్దేశించి అనుచితంగా మాట్లాడిన తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తాతా మధును బీఆర్ఎస్ పార్టీ నుంచి వెంటనే బహిష్కరించాలని పార్టీ అధినేత కేసీఆర్‌ను కోరారు. సమస్యలు ఉంటే శాసనసభలో చర్చించి పరిష్కరించుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో దూకుడుగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో నేర్చుకున్నది ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత రాజకీయాలతో ప్రజల ముందు నవ్వులపాలయ్యేలా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. బీఆర్ఎస్‌లో ఉన్న దళిత నాయకులు ఈ ఘటనపై స్పందించకపోవడం బాధాకరమని రాజనర్సు అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యావత్ దళిత సమాజం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.







## పౌష్టికాహారంతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది: మేయర్ ధర్ని మధుకర్

### - శ్రీరాంపూర్ జడ్పీ హైస్కూల్‌లో అల్పాహార పంపిణీ ప్రారంభం

**నస్పూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడి, చదువుపై సానుకూల ప్రభావం చూపుతుందని మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ పేర్కొన్నారు. 31వ డివిజన్ శ్రీరాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం, హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత అల్పాహార పంపిణీని స్థానిక కార్పొరేటర్ తాళ్ళ సంపత్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో రాష్ట్రంలోనే నాలుగో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు కావడం హర్షణీయమని మేయర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ట్రస్మా ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానం

**అదిలాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:**




తెలంగాణ గుర్తించిన ప్రైవేట్ యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ మండలంలోని నాగభూషణ్ మెమోరియల్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయినులు మమత, కరుణలతో పాటు సోనాల మండలంలోని ఉషోదయ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు బి. సంజయ్ కుమార్‌లను ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషల చేతుల మీదుగా వీరు పురస్కారాలను అందుకున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధనకు అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రతినిధులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ధనిలో ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత

**సారంగాపూర్, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:**

మండలంలోని ధని గ్రామంలో ఎంపికైన ఆరుగురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సర్పంచ్ బడి పోతన్న మంజూరు పత్రాలను అందజేశారు. పత్రాలు స్వీకరించిన లబ్ధిదారులు సర్పంచ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అనంతరం గ్రామంలో పాతబడిన ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో నూతన సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీనివాస్, జేఎల్ఎం సంపత్, ఉపసర్పంచ్ ఆరే నారాయణ, నాయకుడు తోట మల్లేష్, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడులకు మహర్దశ..

### - ఉమ్మడి జిల్లాకు 8 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు మంజూరు

**నిర్మల్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**



సర్కార్ బడులను కార్పొరేట్, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు ఆధునిక మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్రంలోని 73 ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టిజిపిఎస్)గా మార్చేందుకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ. 699.89 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 8 పాఠశాలలు మంజూరయ్యాయి. వీటి అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 83.19 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో ఆదిలాబాద్ జిల్లాలోని యాపాలగూడ జడ్పీహెచ్‌ఎస్‌కు రూ. 10.20 కోట్లు, మంచిర్యాల సీతారాంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు రూ. 12 కోట్లు, మందమర్రి టీజీ ఎంఎస్‌కు రూ. 10.70 కోట్లు, కాసిపేట టీజీ ఎంఎస్‌కు రూ. 10.30 కోట్లు కేటాయించారు. అలాగే నిర్మల్ జిల్లాలోని కుంటాల టీజీ ఎంఎస్‌కు రూ. 9 కోట్లు, నర్సాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు రూ. 12.50 కోట్లు మంజూరవ్వగా, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ జడ్పీహెచ్‌ఎస్‌కు రూ. 8.40 కోట్లు, కాగజ్‌నగర్ జడ్పీహెచ్‌ఎస్‌కు రూ. 10.09 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో పాఠశాలల్లో నూతన భవనాలు, డిజిటల్ తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, తాగునీరు, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణాలు, దివ్యాంగులకు ర్యాంపుల వంటి సమగ్ర వసతులు కల్పించనున్నారు. అభివృద్ధి పనులను తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఈప్రొక్యూర్మెంట్ టెండర్ విధానంలో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## పూలే దంపతుల ఆశయాలు ఆచరణలోకి రావాలి

### - ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో చిత్రపటాలు ఏర్పాటు చేయాలి: బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్

**మంచిర్యాల, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**



మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలను ప్రతి ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థలో ఏర్పాటు చేయాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ కోరారు. మంగళవారం మంచిర్యాల మేయర్ ధరణి మధు, డిప్యూటీ మేయర్ చల్ల రమ్యకు పూలే దంపతుల చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పూలే దంపతుల సేవలు, ఆశయాలను భావితరాలకు చేరువ చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చిత్రపటాల ఏర్పాటు కేవలం గౌరవ సూచకంగా కాకుండా విద్యాభివృద్ధి, మహిళా సాధికారత, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి స్ఫూర్తిగా నిలవాలని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో పూలే దంపతుల జీవిత చరిత్ర, మహిళా విద్య కోసం చేసిన కృషిని విద్యార్థులకు పరిచయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా కార్యదర్శి బియ్యాల సత్తయ్య, ఆకుతోట పద్మాదేవి, ఇనవంక నాగలక్ష్మి, జక్కం రవీందర్, జంపాల చంద్రయ్య, ఎం.డి. హుస్సేన్, గొల్ల సత్యనారాయణ, పొదిశెట్టి వినోద్, చల్ల విజయ్ కుమార్, తాటిపాముల సమ్మయ్య, పల్లపు శ్రీనివాస్, ముదిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల బుకింగ్ యాప్‌పై రైతులకు అవగాహన

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**



రైతులు ఫెర్టిలైజర్, యూరియా, డీఏపీ, పొటాషియం తదితర ఎరువులను సులభంగా బుక్ చేసుకునేందుకు ఉపయోగపడే ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ వినియోగంపై కన్నాల రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, బుచ్చయ్యపల్లి సర్పంచ్ జాడి మహేశ్వర్ రైతులకు యాప్‌ను ఏ విధంగా వినియోగించుకోవాలి, అవసరమైన ఎరువులను ఎలా బుక్ చేసుకోవాలి అనే అంశాలపై వివరించారు. ఉమ్మడి అక్కెనపల్లి గ్రామ పంచాయతీలైన అక్కెనపల్లి, బుచ్చయ్యపల్లి, లింగాపూర్ పరిధిలో వెంకట ముత్యంరావుకు సంబంధించిన భూములతో పాటు పీపీ భూముల్లో సాగు చేస్తున్న రైతులు ఎరువుల బుకింగ్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయానికి అవసరమైన ఎరువులను ముందుగానే బుక్ చేసుకోవడం ద్వారా రైతులకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్, ఏఈఓ గౌస్య, తిరుపతితో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



## ఎస్సీ హాస్టల్‌కు శాశ్వత భవనం, మౌలిక వసతులు కల్పించాలి

**కడెం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**

కడెం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు శాశ్వత భవనం మంజూరు చేసి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని దళిత సంఘాల నాయకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. సుమారు 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ హాస్టల్‌ను తొలుత అద్దె భవనంలో నిర్వహించేవారని, యజమాని ఖాళీ చేయించడంతో ప్రస్తుతం జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలోకి మార్చారని తెలిపారు. హాస్టల్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్నానాలకు, ప్లేట్లు కడుక్కోవడానికి 200 మీటర్ల దూరం నడచి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో విద్యుత్ వెలుగులు లేక చీకట్లోనే వెళ్లాల్సి వస్తోందని, దీనికి తోడు కోతుల బెడద, వర్షాకాలంలో విషసర్పాల ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వసతులు లేకపోవడంతో గతంలో 100 మంది వరకు ఉన్న విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోయిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నూతన భవనంతో పాటు తాగునీరు, స్నానాల గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అరకొర వసతులతో విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా ప్రభుత్వం స్పందించాలని సామాజికవేత్త ఆర్ల రమేష్, దళిత సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు.

## ఛలో అసెంబ్లీకి వెళ్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల ముందస్తు అరెస్ట్

**సారంగాపూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**



తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర లైసెన్స్‌డ్ సర్వేయర్ల జేఏసీ పిలుపునిచ్చిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి బయలుదేరిన మండల సర్వేయర్లను సారంగాపూర్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పనికి తగిన గౌరవ వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, క్యాషియర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, మండల సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**నస్పూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

జిల్లాలో వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు చర్యలు తీసుకొని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మరావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2026-27లో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని, ధాన్యం కొనుగోళ్ల కొరకు సంబంధిత ఏజెన్సీలతో ముందస్తు సమావేశాలు నిర్వహించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితులలోనూ లోతట్టు ప్రాంతాలలో ఏర్పాటు చేయరాదని, ఎత్తైన ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చదునుగా ఉన్న అనుకూల ప్రదేశాలను ఎంపిక చేసి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జీలకు తరచుగా అడిగే ప్రశ్నలపై అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు విధానం తదితర అంశాలపై రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర అవసరమైన సదుపాయాలను ముందుగానే సమకూర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు సబ్సిడీపై కంది విత్తనాలు

**పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

మండలంలోని ఎల్కపల్లి రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఎకరాకు సరిపడే 4 కిలోల ప్యాకెట్‌ను రూ.400కు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు ముందుగా నమోదు చేసుకుని విత్తనాలు పొందాలని సూచించారు. కంది సాగు, విత్తన వినియోగం, పంట యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఏఈఓలు శ్రీవిద్య, వంశీ, రైతులు పాల్గొన్నారు.

## తాండూర్ ఐబిలో కాంగ్రెస్ శ్రేణుల రాస్తారోకో

**తాండూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

తాండూర్ మండలం ఐబిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేయడానికి నిరసిస్తూ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీసీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, మాజీ జెడ్పిటిసి సాలిగామ బానయ్య, పార్టీ మండల అధ్యక్షులు పెద్ద బోయిన శంకర్, ఉపాధ్యక్షులు, మోమినాలి, ప్రధాన కార్యదర్శులు అడప నవీన్, కట్కాల మల్లేష్, కార్యదర్శులు మాసాడి ప్రభాకర్, జైన సాంబయ్య, నాయకులు చిట్ల రమేష్, మారిశెట్టి శ్రీనివాస్, ఆకుల వెంకటేష్, గాట్ల నరసయ్య, పోలవేణి తిరుపతి, కుషనపల్లి లక్ష్మణ్, మామిడాల రాజేశం, మడావి పర్బత్ రావు, గాజుల రామ్మోహన్ రావు, మోసిన్, పుట్ట శ్రీనివాస్, జంబోజుల ప్రవీణ్, కొండగొర్ల అంజి, తదితరులు పాల్గొన్నారు.



తాండూర్ ఐబిలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రతిపక్ష నాయకులు, ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి నివాసం వద్ద ఏర్పాటుచేసిన పత్రికల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నిర్వహిస్తున్న ప్రజాస్వామ్య కార్యక్రమాలను పోలీసుల ద్వారా అడ్డుకోవడం సరికాదన్నారు. నిరసన తెలిపే హక్కును కాపాడుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు అదే హక్కును అణచివేస్తోందని మండిపడ్డారు. ప్రజల గొంతును అణచివేయకుండా రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును కాపాడాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఆర్ఎస్ జిల్లా నాయకురాలు మర్సుకోల సరస్వతి

## బీజేపీ సేవా సంకల్ప్ అభియాన్‌పై వర్క్‌షాప్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రభుత్వ పాలనను పురస్కరించుకుని చేపడుతున్న సేవా సంకల్ప్ అభియాన్ పై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోనీ శ్రీశైలం అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించనున్నారని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, సేవా సంకల్ప్ కన్వీనర్ కోవ విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న ఉదయం 10:30 గంటలకు ఆసిఫాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పర్యటన, వివిధ మోర్చాల పూర్తి నిర్మాణంపై చర్చించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మోర్చాల అధ్యక్షులు, సేవా సంకల్ప్ కన్వీనర్లు, సీనియర్ నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

**- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజన్న**

**పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, కాంగ్రెస్ నాయకులపై మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సముద్రాల రాజన్న మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు హుందాతనంతో వ్యవహరించాలని సూచించారు. వ్యక్తిగత విమర్శలకు దిగితే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, షేక్ ఉస్మాన్, చౌదరి శ్రీనివాస్, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యార్థులతో మాక్ అసెంబ్లీ

**పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

జడ్‌పీహెచ్ఎస్ పెంచికల్‌పేట్‌లో మంగళవారం మాక్ అసెంబ్లీని ఘనంగా నిర్వహించారు. శాసనసభలో ప్రజా సమస్యల ప్రస్తావన, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రశ్నోత్తరాల సమయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల స్పందన తీరును విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఈశ్వర్‌రావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, సీనియర్ ఉపాధ్యాయుడు యాదగిరితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్‌లో రామ్‌లీలా వేడుకలను యాజమాన్యమే నిర్వహించాలి

**- బీఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాతాడి శ్రీధర్ రెడ్డి**

**- జీఎం మునిగంటి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేత**

**నస్పూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

దసరా ఉత్సవాల సందర్భంగా సింగరేణిలోని ఇతర ప్రాంతాల్లో మాదిరిగానే శ్రీరాంపూర్ ఏరియాలోనూ రామ్‌లీలా కార్యక్రమాన్ని యాజమాన్యమే అధికారికంగా నిర్వహించాలని బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాతాడి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీఎం కార్యాలయంలో శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌ను కలిసి బీఎంఎస్ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా నాతాడి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలు ఎంతో భక్తిశ్రద్ధలతో దసరా పండుగ జరుపుకుంటారని, శ్రీరాంపూర్ పరిధిలోని కార్మికుల కోసం రామ్‌లీలా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రగతి స్టేడియాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా సెక్రటరీ రాజారాం కిరణ్ కుమార్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ఎర్రం తిరుపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మిట్ట మధుకర్, ఎస్సార్పీ3 పిట్ సెక్రటరీ భూపల్లి రమేష్, ఆర్‌కే5 పిట్ సెక్రటరీ కుమ్మరి చంద్రశేఖర్, ఆర్‌కే 7 పిట్ సెక్రటరీ కుంట రాజు, పిట్ కోఆర్డినేటర్ కంపెల్లి తిరుపతి, ఎస్సార్పీ 3 అసిస్టెంట్ పిట్ సెక్రటరీ చల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

**- మండల అభివృద్ధి అధికారి ఉజ్వల్‌కుమార్ - ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ పురస్కార మహోత్సవం**

**- ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు సన్మానం**



**కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కాగజ్‌నగర్ మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ పురస్కార మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి ఉజ్వల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉజ్వల్ కుమార్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి వంటి లక్షణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ కొయ్యడ శ్రీనివాస్ పాల్గొని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి పురస్కారాలు అందజేశారు. ఎంఈవో వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యా కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో ఉపాధ్యాయుల సహకారం ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## తాత మధు దిష్టిబొమ్మ దహనం

**ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

దళితులను అవమానించే విధంగా మాట్లాడారంటూ బీఆర్ఎస్ నాయకుడు తాత మధుపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీసీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాపర్తి మురళి ఆధ్వర్యంలో తాత మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఎవరూ వ్యాఖ్యలు చేయడం సమాజానికి మంచిది కాదన్నారు. అన్ని వర్గాల ప్రజల గౌరవాన్ని కాపాడేలా నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. దళితులను అవమానించే వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత నాయకులు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఇరుకుల మంగా, వైస్ చైర్మన్ రవీందర్, టౌన్ ప్రెసిడెంట్, జిల్లా ఉపాధ్యక్షులు తారిక్, భీంరావు, కౌన్సిలర్ జాడి విరోడ్, ఏఎంసీ డైరెక్టర్లు జక్కన్న, విశ్వనాథ్, లత, ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు చెట్ల నారాయణ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## 112వ రోజుకు ఎస్‌పీఎం కార్మికుల రిలే దీక్షలు

**- గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్**

**కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

సిర్పూర్ పేపర్ మిల్ (ఎస్‌పీఎం)లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 112వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అబ్దుల్ నబి దీక్షలో కూర్చున్నారు. ఆయనకు మద్దతుగా వెంకటేశు, షబ్బీర్, రాజన్న, మల్లేష్, ఏ. కేసింగ్ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌పీఎంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించి, కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చలు జరిపి వేతన ఒప్పందం కుదుర్చుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. దీక్షలు 112 రోజులకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం స్పందించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం, ఎస్‌పీఎం యాజమాన్యం స్పందించి వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి కార్మికులకు న్యాయం చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

**- ఖండించిన బి.ఆర్.ఎస్ నాయకులు**

**జన్నారం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం రోజున ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కూడా హరించే విధంగా ముందస్తు అరెస్టులు చేయడం సరైన చర్య కాదని అన్నారు. అరెస్టులతో బీఆర్ఎస్ నాయకుల గొంతులను నొక్కలేరని, ప్రజా సమస్యలపై ప్రశ్నించే స్వరాలను ఆపలేరని అన్నారు. ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అరెస్టయిన వారిలో సర్పంచ్ పేరం శ్రీనివాస్, సుతారి వినయ్ కుమార్, ఫజల్ ఖాన్, ఉపసర్పంచ్ కల్లెం శ్రీనివాస్ రెడ్డి, జాడి గంగాధర్, ప్రేమ్ సాగర్, శ్రీనివాస్ గౌడ్, బాధవత్ సాయికిరణ్, అప్పని సాయికుమార్ తదితరులు ఉన్నారు.



## స్టూడెంట్ యూనియన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

**జన్నారం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

ఢిల్లీ యూనివర్సిటీలో జరుగుతున్న స్టూడెంట్ యూనియన్ ఎలక్షన్స్ ప్రచారంలో ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాకర్ తో కలిసి జన్నారం మండల ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు సోహెల్ షా, వాళ్ళ బృందం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. విద్యార్థుల కోసం ఎన్ఎస్‌యుఐ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా బలోపేతం కోసం పూర్తి కృషి చేస్తామని జాతీయ అధ్యక్షుడికి తెలపడం జరిగింది. అతి తొందరలో తెలంగాణ రాష్ట్రంలో మంచిర్యాల్ జిల్లా జన్నారం మండలం ఒక పెద్ద ఎత్తున విద్యార్థులతో సభ పెట్టి ఆయనని ఆహ్వానిస్తాము అని తెలిపారు.

## పీజీ సీటు కోసం నేటి నుంచి వెబ్ ఆప్షన్లు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంకాం కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో పీజీ ప్రవేశాల కోసం టీజీ సీపీజీఈటీ-2026లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు, ఉత్తీర్ణులు కాని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. వెబ్ ఆప్షన్లలో బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ నెల 14న సీట్ల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన పీజీ సెంటర్ విజయవంతంగా కొనసాగుతోందని, స్థానికంగానే ఉన్నత విద్యను అభ్యసించే ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కాంపల్లి శంకర్ కోరారు. మరిన్ని వివరాలకు 9959269975 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

**- మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్**



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వారి ఇళ్ల వద్దే పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ నాయకులను ఎలాంటి స్పష్టమైన కారణాలు లేకుండా ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని ఆయన అన్నారు. అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరని, ప్రజల సమస్యల కోసం తమ గొంతును మరింత బలంగా వినిపిస్తామని స్పష్టం చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని బిఆర్ఎస్ గొంతును నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజాక్షేత్రంలో ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. ముందస్తు అరెస్టులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ముందస్తుగా అరెస్టయిన వారిలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు నూనెటి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ విజయ్, సుందర్‌రావు, ఆసాది మధు, బండారి ప్రవీణ్, ఈట రాకేష్, సబ్బని అరుణ్, గోలి శివ, చరణ్, రాజులాల్ యాదవ్, గోపి, ఎలిగేటి శ్రీనివాస్, కేంశెట్టి శ్రీనివాస్, ధర్మేందర్, అరుణ్ తదితరులు ఉన్నారని తెలిపారు.

## ఆశ వర్కర్ల అరెస్టులు సరికాదు

**జన్నారం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కొరకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, చలో హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా కార్యక్రమానికి ఆశ వర్కర్లు వెళ్లకుండా ముందస్తుగా అరెస్టులు చేయడం న్యాయం కాదని, సిఐటియు సీనియర్ నాయకులు కూకటీకారు బుచ్చయ్య ఖండించారు. ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారు. వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులు. నేటికీ వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీసం గ్యారంటీ ఫిక్స్డ్ వేతనం కూడా ప్రభుత్వం నిర్ణయించలేదని, ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ధర్నా కార్యక్రమానికి వెళ్తుంటే పోలీస్ వారు అరెస్టు చేసి అడ్డుకోవడం సరికాదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా అనేక హామీలు ఇచ్చింది. అవి నెరవేర్చలేదు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వము కూడా హామీలు ఇచ్చి ఇంత కాలం గడిచిన ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని అన్నారు. కామ్రేడ్ నీరజ మాట్లాడుతూ 50 లక్షల ఇన్సూరెన్స్, 50,000 మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, తదితర హామీలు ఇచ్చి, ఇంతవరకు అమలు చేయలేదని, పిఆర్సి ఏరియాస్, లెప్రసీ, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు సంవత్సరాలు తరబడి పెండింగ్లో ఉన్నాయని అన్నారు. ఆశా వర్కర్లకు 18 వేల రూపాయల ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయినా ఆశ వర్కర్లు జి.శైలజ, ఎం. లక్ష్మి, టి. రాజేశ్వరి, డి వజ్రమాల, కళావతి ఆర్. గంగామణి, సుజాత, పి రమ, కే. సునీత, ఎం. శైలజ, ఎం. భూమక్క, డి. సూర్య తదితరులు అరెస్టు అయ్యారు.

# అక్రమంగా పశువులను తరలిస్తున్న ఆరుగురికి రిమాండ్

**బెజ్జూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**



బెజ్జూర్ మండలంలో అక్రమ పశువుల రవాణాపై బెజ్జూర్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. అక్రమంగా పశువులను తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి మొత్తం 41 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సర్తాజ్ పాషా తెలిపారు. గత కొద్ది రోజుల క్రితం బెజ్జూర్ మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులు మహారాష్ట్ర రాష్ట్ర నుంచి 41 పశువులను అక్రమంగా కొనుగోలు చేసి, వాటిని గోవధ కోసం తరలిస్తున్న సమయంలో బెజ్జూర్ మండల పరిధిలో పోలీసులు పట్టుకున్నారు. వారు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండటంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బెజ్జూర్ మండలానికి చెందిన ఆరుగురు నిందితులను సోమవారం సాయంత్రం ఆసిఫాబాద్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో మంగళవారం వేకువజామున వారిని ఆసిఫాబాద్ సబ్‌జైలుకు తరలించారు. అక్రమ పశువుల రవాణాకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్ఐ సర్తాజ్ పాషా హెచ్చరించారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అన్నారు.



## నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

### - అనుమతులు తప్పనిసరి.. డీజేలకు అనుమతి లేదు

### - మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్

**నస్పూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

పోలీస్ నిబంధనలు పాటిస్తూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్ సూచించారు. మంగళవారం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గణేష్ మండపాల నిర్వాహకులతో అవగాహన సమావేశం నిర్వహించారు. నిర్వాహకులు ముందుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని పోలీస్ శాఖ నుంచి అధికారిక అనుమతి పత్రం తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి లేకుండా విగ్రహాలు ప్రతిష్టించరాదని తెలిపారు. శాంతిభద్రతల దృష్ట్యా మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, కేవలం భక్తి పాటలు మాత్రమే వేసుకోవాలని పేర్కొన్నారు. మద్యం సేవించడం, లక్కీ డ్రాలు నిర్వహించడం, రాజకీయ ప్రసంగాలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భద్రత కోసం ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీసీ నస్పూర్ ఎస్సై మేకల ప్రశాంత్, పోలీస్ సిబ్బంది, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## సింగరేణి క్వార్టర్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

### - తాళాలు పగులగొట్టి ఆధీనంలోకి...

### - సామగ్రి తరలింపునకు చర్యలు

**మందమర్రి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణంలో బి.ఆర్.ఎస్. నాయకుడు మద్ది శంకర్ నివాసం ఉంటున్న సింగరేణి క్వార్టర్‌ను మంగళవారం సింగరేణి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్టేట్ జూనియర్ ఆఫీసర్ ఆసిఫ్, క్వార్టర్ సెక్షన్ ఇన్‌చార్జి సీనియర్ పీఓ కార్తీక్, ఏరియా యాక్టింగ్ సెక్యూరిటీ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్అండ్‌పీసీ, సివిల్ విభాగాల సిబ్బంది క్వార్టర్ వద్దకు చేరుకుని తాళాలు పగులగొట్టి క్వార్టర్‌ను సింగరేణి ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం క్వార్టర్‌లోని ఇంటి సామగ్రిని స్వాధీనం చేసుకుని సింగరేణి డ్యూటీ డీసీఎం వాహనంలో ఎస్అండ్‌టీసీ కార్యాలయానికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మందమర్రి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. క్వార్టర్ స్వాధీనానికి దారితీసిన కారణాలు, అధికారిక ఉత్తర్వులు, నిబంధనలకు సంబంధించిన వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా, పై అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే క్వార్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు, సంబంధిత అధికారిక ఉత్తర్వులు వెల్లడైతే ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త**



పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ (2026-27) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ సాధన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సై గోపతి సురేష్ హాజరై విద్యార్థుల చే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థుల ఎన్నికల్లో ఎన్నికైన వారికి స్లాట్స్, బ్యాడ్జెస్‌తో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఇన్వెస్టిచర్ సెర్మనీ ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, బాధ్యత, క్రమశిక్షణ, కర్తవ్య నిర్వహణ నేర్పడం అని అన్నారు. నాయకత్వ లక్షణాలను గురించి వివరించి విద్యార్థులను, సంస్థను ఎంతగానో కొనియాడారు. విద్యార్థులు నాయకత్వ పటిమను నేర్చుకోవాలని వివరించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎల్ రమేష్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాధన, పాఠశాల అకాడమిక్ డీన్ సతీష్, ప్రైమరీ ఇన్చార్జి శైలజ, పిపిటి ఇంచార్జి అశ్విని, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులందరూ పాల్గొన్నారు. ఇంత ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, జోనల్ ఏజీఎం అరవింద రెడ్డి, జోనల్ అకడమిక్ కో ఆర్డినేటర్ నాగరాజు ఎంతగానో అభినందించారు.

## హిందూ ఉత్సవ సమితికి నూతన కార్యవర్గం

### - ఏకగ్రీవంగా ఎన్నిక.. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సమష్టి కృషి

**మంచిర్యాల, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

మంచిర్యాల విశ్వనాథ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మంచిర్యాల నగర హిందూ ఉత్సవ సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సంఘచాలకులు డాక్టర్ బద్రినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది డేగ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా కర్ణకంటి రవీందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఇరుకుల సత్యనారాయణ, నరెడ్ల శ్రీనివాస్, బోయిని హరికృష్ణ, పాలమాకుల వెంకటరెడ్డి, పూజారి ప్రభాకర్, తూముల వెంకటేష్, ఇరుకుల్ల రాజేశం, కోశాధికారులుగా ముత్యాల కృష్ణ, కైరోదు సురేంద్రచారి, కార్యదర్శులుగా రాముగారి శ్రీనివాస్, మల్కా ప్రతాప్, సందేశ్ గుప్తా, మణికంఠ, కొండ కార్తీక్, ఆకుల సంతు, కీర్తి నవీన్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా సుందర్ బల్దవ, కంకణాల భాస్కర్, కర్రె లచ్చన్న, తోట తిరుపతి, మోదంపురం వెంకటేశ్వర్లు, కందే బద్రినారాయణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నగర సహ కార్యవాహ బాపూజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ నగరంలో హిందూ పండుగలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను సమష్టిగా నిర్వహిస్తూ హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు హిందూ సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.





## చెన్నూరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల పోటాపోటీ ర్యాలీ

### - పోలీసులు బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వివాదం

**చెన్నూరు, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని తెలంగాణ సర్కార్ ను నిలదీసినందుకు మా నాయకుల చిత్రపటాలకు చెప్పుల దండలు వేయడం నీచమైన చర్య అని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు చెప్పుల దండలు వేసి నిరసన చేపట్టడంపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చిత్రపటాలకు వేసిన చెప్పుల దండలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ప్రతిపక్ష హోదాలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ తీరును కాంగ్రెస్ జీర్ణించుకోలేక అధికార బలంతో స్థానిక నాయకులను అరెస్టు చేయిస్తోందని, అగ్రనేతలను రాజ్యాంగ విరుద్ధంగా అడ్డుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం నీచ రాజకీయాలకు పాల్పడుతోందని వారు విమర్శించారు.

## ఉత్పత్తి కంటే రక్షణే ముఖ్యం... రక్షణ లేని ఉత్పత్తి వ్యర్థం

### - శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

### - ఎక్స్‌ప్లోజివ్స్ వినియోగం, భద్రతపై గనుల అధికారులతో సమీక్ష సమావేశం

**నస్పూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

ఉత్పత్తి కంటే రక్షణే ముఖ్యం... రక్షణ లేని ఉత్పత్తి వ్యర్థం అని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఎక్స్ ప్లోజివ్స్ వినియోగం, ప్రమాదాల నివారణపై ఏరియాలోని అన్ని గనుల ఏజెంట్లు, ప్రాజెక్ట్ అధికారులు, మేనేజర్లతో మంగళవారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పని ప్రదేశాలలో ఉద్యోగుల భద్రతకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గనుల్లో రూఫ్ ఫాల్, సైడ్ ఫాల్, హాలేజ్ వంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎక్స్ ప్లోజివ్స్, ఎలక్ట్రికల్ ప్రమాదాల నివారణలో అత్యంత అప్రమత్తత అవసరమని, వీటి విషయంలో డీజీఎంఎస్ నిబంధనల నుంచి ఎలాంటి మినహాయింపులు ఉండవని జీఎం హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల సమర్థవంతమైన వినియోగంపై షాట్ ఫైరర్లు, మైనింగ్ సర్దార్లు, సూపర్‌వైజర్లకు గనుల వారీగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గనులకు సరఫరా అయ్యే ఎక్స్ ప్లోజివ్స్ నాణ్యతను పరిశీలించి, లోపాలు లేదా డ్యామేజ్ ఉన్నవాటిని తక్షణమే సప్లయర్లకు తిప్పి పంపాలని స్పష్టం చేశారు. రోజూ ఫీల్డ్ సిబ్బంది నుంచి నివేదికలు తీసుకుంటూ మిస్‌ఫైర్, నో బ్లాస్ట్ వంటి సమస్యలు తలెత్తకుండా సరఫరాదారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. అవర్ ఎయిమ్ జీరో హార్మ్ లక్ష్యంగా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్వో టు జీఎం కృష్ణ ప్రసాద్, ఏరియా ఇంజనీర్ సురేష్, ఏజీఎం (ఫైనాన్స్) శ్రీధర్, ఐకె ఓసీ పీవో ఏవీ రెడ్డి, ఆర్.కె గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, ఎస్ఆర్‌పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, డీజీఎం (సేఫ్టీ) విజయ్ కుమార్, డీజీఎం (స్టోర్స్) మల్లయ్య, వివిధ గనుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.



# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

**నిర్మల్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**



బాసర ఆలయ అభివృద్ధి పనులు, రాబోయే గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు, గోదావరి పుష్కరాలు 2027 ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిలతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ పుష్కర ఘాట్‌ల వద్ద భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పటిష్ట భద్రత కోసం సీసీ కెమెరాలు, వాచ్ టవర్లు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, పోలీసు బందోబస్తు ఏర్పాటుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎస్పీ డా. జి. జానకి షర్మిలా మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, ట్రాఫిక్ మళ్లింపులు, రద్దీ నిర్వహణపై పోలీస్ శాఖ తరఫున అన్ని చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ఈఈలు అనిల్, సుభాష్, సందీప్, ఆలయ ఈఓ అంజనా దేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ అభివృద్ధికి రూ.12.50 కోట్లు మంజూరు

**- నర్సాపూర్-జి జెడ్‌పిహెచ్‌ఎస్ బడికి మహర్దశ**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:**

నిర్మల్ నియోజకవర్గంలో విద్యారంగానికి శుభవార్త. నర్సాపూర్‌జి మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ (తెలంగాణ పబ్లిక్ స్కూల్) సమగ్ర అభివృద్ధి కోసం సమగ్ర శిక్ష పథకం కింద రూ.12.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నర్సాపూర్‌జి పాఠశాలకు ఈ భారీ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలలో ఆధునిక తరగతి గదులు, డిజిటల్ లైబ్రరీ, సైన్స్ కంప్యూటర్ ల్యాబ్ లు, మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం, ప్రహరీ గోడ, ఆటస్థలం అభివృద్ధి తదితర మౌలిక వసతులు కల్పించనున్నారు. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభా పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విద్యా ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన, కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నర్సాపూర్-జి పాఠశాలకు రూ.12.50 కోట్లు మంజూరు కావడం వల్ల పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

## క్రీడా ప్రతిభకు పదును.. ఎంపిక పోటీలకు వేళాయె!

**- జిల్లా స్థాయి కరాటే, వుషు పోటీల్లో 300 మంది**

**క్రీడాకారుల ఉత్సాహభరిత పాల్గొనడం**

**మంచిర్యాల, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే, వుషు ఎంపిక పోటీలు మంగళవారం మంచిర్యాల జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. పద్నాలుగు, పదిహేడు సంవత్సరాల విభాగాల్లో కరాటే, పదిహేడు సంవత్సరాల విభాగంలో వుషు పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల క్రీడా సమాఖ్య రెండువేల ఇరవై ఆరు-ఇరవై ఏడు జిల్లా క్రీడా షెడ్యూల్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మాళవి దేవి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సుధ, క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.డి. యాకూబ్, నిర్వాహక కార్యదర్శి ఆర్. రాజయ్య, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి బి. బాబురావు, కుమారస్వామి, సత్తయ్య, కరాటే సంఘం అధ్యక్షుడు రవి, కార్యదర్శి శివమహేష్, కోశాధికారి నాగలక్ష్మి, క్రీడా ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్లు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం

**కడెం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**

తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ, డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వేద్మ భొజ్జు పటేల్ ఆదేశాల మేరకు కడెం మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలపై చట్టపరంగా సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇవి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పరిధిలోకి వస్తే కేసు నమోదు చేయాలని, ఆయన ఎమ్మెల్సీ పదవిపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరిస్తే బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పడిగల భూషణ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాలు మౌనిక

**ఉట్నూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**



ఉట్నూర్ మండలంలోని లింగోజితండా ఎక్స్ రోడ్డు వద్దగల న్యూ నలందా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు మోనిక ఉత్తమ ఉపాధ్యాయురాలు (బెస్ట్ టీచర్) అవార్డు అందుకున్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో తెలంగాణ గుర్తించిన ప్రైవేట్ యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు, అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేశారు. న్యూ నలందా పాఠశాలలో అందిస్తున్న విశిష్ట సేవలకుగాను ఉపాధ్యాయురాలు మోనికను ట్రస్మా ప్రతినిధులు ఎంపిక చేయగా, జిల్లా కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్, జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ), ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు పవన్, ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, వివిధ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## పలు గ్రామాల్లో చెత్తబుట్టల పంపిణీ

**సారంగాపూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల (బి), తాండ్ర, ప్యారమూర్ గ్రామాల్లో ప్రజలకు పంచాయతీ ఆధ్వర్యంలో చెత్తబుట్టలను పంపిణీ చేశారు. తాండ్ర గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఎంపీఓ అజీజ్ ఖాన్ పాల్గొని బుట్టలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా వేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ప్రతిరోజూ ఇళ్ల వద్దకు వచ్చే చెత్త సేకరణ బండ్లలోనే చెత్తను వేయాలని కోరారు. గ్రామాలను స్వచ్ఛ, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బల్గురి అజయ్, కొప్పుల వెన్నెల, మాకునూర్ వరలక్ష్మి, ఉప సర్పంచులు శ్రీకాంత్ రెడ్డి, రామ్ రెడ్డి, లక్ష్మీ గంగన్న, నాయకులు సాయన్న, నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు ఈసారి శివరత్నం, మహేందర్ సింగ్, రఘుకిరణ్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## టెస్టింగ్ పేరుతో అధిక శబ్దం: డీజే సీజ్, యజమానిపై కేసు నమోదు

**అదిలాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:**




బోథ్ మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా టెస్టింగ్ పేరుతో అధిక శబ్దంతో డీజే ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన యజమాని ఇర్షాద్ అలీపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. డీజే పరికరాలతో పాటు సంబంధిత వాహనాన్ని సీజ్ చేసి బోథ్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. బోథ్ మండల కేంద్రంలో అధిక శబ్దంతో డీజే వినియోగిస్తున్న సమాచారం అందుకోవడంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యం కలిగిస్తే ప్రజా ప్రశాంతతకు భంగం వాటిల్లడమే కాకుండా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని డీఎస్పీ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, శబ్ద కాలుష్య నియంత్రణ చట్టాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, టెస్టింగ్ పేరుతో అధిక శబ్దాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే యజమానులు కేవలం పరిమితులకు లోబడి మాత్రమే సౌండ్ సిస్టమ్స్ వాడాలని సూచించారు. ఈ చర్యల్లో బోథ్ సీఐ డి. గురుస్వామి, ఎస్ఐ వి. పురుషోత్తం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మంద చందనకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**అదిలాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:**

సోనాల మండల కేంద్రానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయురాలు మంద చందన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈమె ప్రస్తుతం బోథ్ మండలంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులను నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్‌లోని ఎస్టీయూ భవన్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషల చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. విద్యాబోధనలో విశిష్ట సేవలు అందించినందుకు గాను ఆమెకు ఈ గౌరవం దక్కింది. ఉత్తమ అవార్డు పొందిన మంద చందను సెయింట్ థామస్ పాఠశాల కరస్పాండెంట్ దీపక్, ప్రిన్సిపల్ స్మిత, సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు.



# కోనప్పను విమర్శిస్తే సహించం..!

**- కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక - జెడ్పీటీసీగా ఉన్నప్పుడు ఏం చేశారు?ఖ**

**- గురుకులం కోసం భూమి కేటాయించాలి - 22-ఏపై సమాధానం చెప్పాలి**

**పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**



మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు కోనేరు కోనప్పపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని పెంచికల్‌పేట్ మండల బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ తరఫున తన భార్యను జెడ్పీటీసీగా గెలిపించుకున్న సముద్రాల రాజన్న ఆ పదవిలో ఉన్న సమయంలో మండలానికి, గ్రామాలకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తన భవనం ముందు డ్రైనేజీ నిర్మించుకోవడం తప్ప ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని, మండల అభివృద్ధిపై మాట్లాడే ముందు గతంలో అధికారంలో ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని వివరించాలని అన్నారు. మండలానికి మంజూరైన రూ.200 కోట్ల సమీకృత గురుకుల పాఠశాలను మండల కేంద్రంలోనే నిర్మించేందుకు 25 ఎకరాల భూమిని వెంటనే కేటాయించాలని కోరారు. 2025లో మండలంలోని సుమారు 10 వేల ఎకరాలను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇప్పుడు విమర్శలు చేస్తున్న వారు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. కోనప్పపై విమర్శలు చేసే ముందు ఎమ్మెల్సీ దండే విఠల్ తన పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. ఇకనైనా వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగం

**- పోలీసులతో కలిసి గొంతు నొక్కే యత్నం సయ్యద్ రిజ్వాన్**

**కెరమెరి, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**

తెలంగాణ ఉప సర్పంచ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ అన్న పిలుపు మేరకు తమ న్యాయమైన హక్కుల కొరకు హలో ఉప సర్పంచ్ చలో అసెంబ్లీ వెళుతున్న సమయంలో కెరమెరి మండల ఉపసర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు సయ్యద్ రిజ్వాన్ సుర్దాపూర్ ఉపసర్పంచ్ బామ్నే సాగర్, కొఠారి ఉప సర్పంచ్ ఆనందరావు లను పోలీసులు తెల్లవారుజామునే ముందస్తు అరెస్టు చేయడం హేయమైన చర్య అని. ఉపసర్పంచ్ ఫోరం మండలం అధ్యక్షులు సయ్యద్ రిజ్వాన్ అన్నారు మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసులతో కలిసి అక్రమ అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని తమ యొక్క న్యాయపరమైన డిమాండ్ల మొదటిది ఉపసర్పంచ్ లకు గౌరవ వేతనం 5000 ఇవ్వాలని గ్రామ వార్డు సభ్యులకు 3000 గౌరవ వేతనం ఇవ్వాలని, తీర్మానం కాపీలో ఉపసర్పంచ్ యొక్క సంతకం కూడా ఉండాలని, ఉప సర్పంచ్ యొక్క అవిశ్వాస తీర్మానం నాలుగు సంవత్సరాలకు పొడిగించాలని అని అన్నారు ప్రభుత్వం తమ యొక్క న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్రిక్తం చేస్తామని చెప్పారు

## సమీకృత గురుకుల పాఠశాల కోసం దీక్ష

**పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో మంజూరైన రూ.200 కోట్ల సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి 25 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ కన్వీనర్ ఎలగందుల తిరుపతి ఆధ్వర్యంలో రెండో రోజు దీక్ష చేపట్టారు. ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 61లో ప్రభుత్వ భూమిని గుర్తించి, సర్వే చేసి మ్యాప్ సిద్ధం చేయాలని కోరారు. పాఠశాల మండల కేంద్రంలోనే నిర్మించాలని, భూమి కేటాయింపు ప్రక్రియను అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జాగో తెలంగాణ యాత్రలో భాగంగా వీర తెలంగాణ సమితి నాయకుడు వి.విక్రమ్‌రెడ్డి (వీవీఆర్) బృందం దీక్షకు మద్దతు తెలిపింది. కార్యక్రమంలో ఏటీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్ సుంపుటం సాయికిరణ్, విద్యార్థులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## తాతా మధుపై పోలీసులకు ఫిర్యాదు

**తాండూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధుపై మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు తాండూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిరుపేద ప్రజల పక్షాన ఉంటూ ప్రజలకి అనేక రకాలుగా సంక్షేమ పథకాలు అందిస్తూ 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకుందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాష్ట్రంలో నిరసనల పేరిట కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారం చేసి, అల్లర్లు సృష్టించేందుకు కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తాత మధు శాసనసభ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడానికి వారు ఖండించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, నాయకులు ఎండి ఈసా, యూత్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కళ్యాణ్, ఉపసర్పంచ్ సత్యం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మంతెన శివకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి పురంశెట్టి అరుణ్, ఉపాధ్యక్షులు శ్రీధర్, నాయకులు ప్రశాంత్, అబ్దుల్, మోసిఫ్ ఖాన్, కాంతారావు, కంపెల శ్రీనివాస్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.



## భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**

భార్యను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన కేసులో నిందితుడు తోడసం శ్యాంరావుకు ఆసిఫాబాద్ జిల్లా, సెషన్స్ కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.15 వేల జరిమానా విధించిందని జిల్లా ఎస్పీ నితికా పంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం...... 2023 మార్చి 3న వాంకిడి మండలం బంబారా గ్రామ శివారులో నిందితుడు తన భార్య సంధ్యారాణిని రాయితో కొట్టి హత్య చేసి గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు పోలీసులను నమ్మించాడు. తొలుత ప్రమాదంగా కేసు నమోదు చేసిన వాంకిడి పోలీసులు దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు హత్య కోణంలో విచారణ చేపట్టారు. నిందితుడు భార్యపై అనుమానంతో గొడవపడి హత్య చేసినట్లు సాక్ష్యాలు, వైద్య, ఫోరెన్సిక్ ఆధారాలతో నిర్ధారించి 302, 201 ఐపీసీ సెక్షన్ల కింద చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధించింది. నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. కేసు దర్యాప్తులో కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## నిర్మల్‌లో భారీ జాబ్ మేళా 150 ఉద్యోగాల భర్తీ

**- ఈ నెల 10న డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు**

**- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:**

నిర్మల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. జిల్లా ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ గురువారం రోజున నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రైవేటు సెక్టార్ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీమతి జె. విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిర్మల్ డిగ్రీ కళాశాలలోని సెమినార్ హాల్ లో ఉదయం 11 గంటలకు ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాకు రెండు ప్రముఖ ప్రైవేటు కంపెనీలు హాజరై స్పాట్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. కె.కె. ఎంటర్ ప్రైజెస్ సంస్థలో సోలార్ ఫిట్టింగ్ టెక్నీషియన్స్ 10 పోస్టులకు ఐటీఐ ఎలక్ట్రికల్ అర్హతతో 18 నుండి 40 ఏళ్ల వారికి నెలకు రూ.15,000 జీతంతో, సేల్స్ ఎగ్జిక్యూటివ్ / సేల్స్ ఆఫీసర్ 50 పోస్టులకు ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ అర్హత గల వారికి రూ.20,000 జీతంతో ఉద్యోగాలు కల్పిస్తారు. వీరికి పని ప్రదేశం నిర్మల్ గా ఉంటుంది. అలాగే వీవీసీ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ సంస్థలో హైదరాబాద్‌లో పనిచేయుటకు సర్వీస్ టెక్నీషియన్ 30 పోస్టులకు ఐటీఐ, ఇంటర్ అర్హతతో 18 నుండి 25 ఏళ్ల వారికి రూ.18,000, సర్వీస్ అడ్వైజర్ 30 పోస్టులకు డిప్లొమా, బీఈ, బీటెక్ అర్హతతో 19 నుండి 25 ఏళ్ల వారికి రూ.19,000, సేల్స్ ఎగ్జిక్యూటివ్ 30 పోస్టులకు డిగ్రీ అర్హతతో 19 నుండి 25 ఏళ్ల వారికి రూ.19,000 జీతంతో నియామకాలు చేపట్టనున్నారు. మొత్తం 150 ఖాళీలను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. అర్హత, ఆసక్తి గల యువతీ యువకులు తమ బయోడేటా లేదా రెజ్యూమె, విద్యా అర్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో నిర్ణీత సమయానికి హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9912212255, 7729992061, 9652707401 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## కౌమార దశలో ఆరోగ్య అవగాహనతోనే బంగారు భవిష్యత్తు

**- డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్**

**- రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ్య కరపత్రాల విడుదల**

**నస్పూర్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

కౌమార దశలోని 10 నుంచి 19 ఏళ్ల బాలబాలికలకు శారీరక, మానసిక ఆరోగ్యంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడం ఎంతో అవసరమని మంచిర్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ్య కార్యక్రమ కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లో పీర్ గ్రూప్ ద్వారా ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కౌమార వయసులో ఎదురయ్యే రక్తహీనత, పోషకాహార లోపం, మానసిక ఒత్తిడి నివారణకు తగిన కౌన్సిలింగ్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, మద్యపానానికి దూరంగా ఉండాలని, బాలబాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై స్పష్టత కల్పించాలన్నారు. అనుచిత ప్రవర్తన ఎదురైతే టోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సీహెచ్‌వోలు కాకిరాల వెంకటేశ్వర్లు, పుట్టా సత్తయ్య, శ్రీనివాస్, పద్మ, సుమన్, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

